ముంపు సమస్యతో కొల్లేరు వాసుల అవస్థ

ఏలూరు (టూటౌన్): వరద ముంపునకు గురైన కొల్లేరు గ్రామ ప్రజలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని ఏపీ రైతు కూలీ సంఘం డిమాండ్‌చేసింది. ఇటీవల వర్షాలకు, వరదల కారణంగా ముంపునకు గురైన పెదపాడు మండలం గోగుంట, భీమడోలు మండలం పైడి చింతపాడు, మండవల్లి మండలం పెనుమాక లంక గ్రామాలను ఏపీ రైతు కూలీ సంఘం ఈ నెల 12,13 తేదీల్లో పరిశీలించి వరద గ్రామాల ప్రజల అవస్థలను తెలుసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను ఏలూరులో విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ భాషా మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలంలోని పెనుమాక లంక గ్రామానికి ఏలూరు నుంచి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా నీటిలో మునిగిపోయి ఉందన్నారు. ఈ గ్రామం నుంచి గుడివాడ వైపు వెళ్లే రోడ్డు కూడా పూర్తిగా నీటిలో మునిగిపోయి ఉంది. దీంతో ఈ గ్రామస్తులు వెళ్లాలంటే పడవలే దిక్కుగా ఉన్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం అందలేదన్నారు. ఈ గ్రామానికి ప్రధాన రోడ్డును ఇప్పుడున్న దానికంటే ఎత్తు పెంచి నిర్మిస్తే వరదలకు రోడ్డు మునగకుండా ఉంటుందన్నారు. గ్రామ పరిధిలోని 350 ఎకరాల చేపల చెరువులు పూర్తిగా నీట మునిగిపోయాయని తెలిపారు. దీనిపై ప్రభుత్వం తక్షణ సర్వే చేసి తగు నష్టపరిహారం ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారని తెలియజేశారు. పెదపాడు మండలం గోగుంటలోని ఎస్సీ కాలనీలో వరద నీరు వచ్చి ఇళ్లన్నీ ముంపునకు గురయ్యాయన్నారు. ఈ పేటలోని చాలామంది కౌలు వ్యవసాయం చేస్తున్నారని వారికి తగు నష్టపరిహారం అందించాలని కోరుతున్నారని తెలిపారు. భీమడోలు మండలం పైడి చింతపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు నీట మునిగి చాలా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. చేపలు, రొయ్యలు చెరువులు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటికి నష్టపరిహారం ఇవ్వాలని కోరుతున్నారన్నారు. ఈ వరద ముంపు గ్రామాలను ఆదుకోవాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ భాషా కోరుతున్నారు. ముంపు గ్రామాలను సందర్శించిన వారిలో పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్, స్త్రీ విముకిత సంఘటన నాయకులు టి.చిన్ని తదితరులు ఉన్నారు.


పెనుమాక లంక గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్న దృశ్యం


కొల్లేరు గ్రామస్తులతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రైతు కూలీ సంఘం నాయకులు

క్లుప్తంగా

పోషకాహారంతో రక్తహీనత నివారణ


పోషకాహార మాసోత్సవంలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్) : పోషకాహారంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చునని ఐసీడీఎస్ ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ ఏ.పద్మావతి తెలిపారు. వెంకటాపురం 5,13,14,15,16 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈడీసీఓ పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. కిషోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. అనంతరం వెంకటాపురం-13 కేంద్రంలో మునగ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.జోషి, ఇన్‌చార్జి హెచ్‌ఎం సరళ, ఎంఎల్‌హెచ్‌వీ నాగలక్ష్మి, జీఎంఎస్‌కే టి.లావణ్య, ఏఎన్‌ఎం బి.సుమతి, ప్రజాప్రతినిధులు ఎం యేసు, ఎస్ సతీష్, సీహెచ్ వెంకట్రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్తకు శుభాకాంక్షలు


జేపీని మర్యాదపూర్వకంగా కలిసిన సొంగా మధు

ఏలూరు టౌన్ : ఏలూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మామిళ్లపల్లి జయ ప్రకాష్‌ను నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు సొంగా మధు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఏలూరులో శుక్రవారం ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో దళితుల కోసం గత ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయటం లేదని మధు విమర్శించారు.

ఉత్తమ ఇంజనీర్‌గా సూరత్తు తేజ



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సివిల్ ఇంజనీరింగ్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ చూపుతున్న ఔత్సాహిక ఇంజనీర్లను ప్రోత్సహించేందుకు ది హిందూ సంస్థ 8 విభాగాల్లో ఉత్తమ ఇంజనీర్లకు అవార్డులను ప్రకటించింది. దీనిలో ఒకటైన రిపేర్స్ అండ్ రీహ్యాబిలిటేషన్ కేటగిరీలో నగరానికి చెందిన యువ ఇంజనీర్ సూరత్తు తేజ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈ నెల 15న తిరుపతిలోని పద్మావతి కళాశాలలో నిర్వహించే కార్యక్రమంలో రామ్ కో సిమెంట్ సంస్థ ఆధ్వర్యంలో అతిథుల ద్వారా అందజేయనున్నారు. అవార్డుకు ఎంపికైన తేజను నగరానికి చెందిన పలువురు ఇంజనీర్లు, ఇంజనీరింగ్ సంస్థలు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

ముంపు గ్రామాల్లో త్వరలో ఉపాధి శిక్షణ కేంద్రం


జేసీ పి.ధాత్రి రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పెరికె వరప్రసాదరావు

ఏలూరు (టూటౌన్): పోలవరం ముంపు గ్రామాల్లో సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా డ్రైవింగ్, స్కూల్ బ్యాగ్స్ మేకింగ్‌లలో శిక్షణ కేంద్రం ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని సొసైటీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డిని కోరారు. స్థానిక జేసీ ఛాంబర్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన పెరికె వరప్రసాదరావు పూలమొక్కను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన ముంపు గ్రామాల్లో శిక్షణకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై జేసీ సానుకూలంగా స్పందించారని త్వరలో పోలవరం ముంపు గ్రామాల్లో డ్రైవింగ్ స్కూల్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ శిక్షణ ప్రారంభిస్తామని వరప్రసాదరావు తెలిపారు.

17 నుంచి నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

దెందులూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 17వ తేదిన నులిపురుగు నిర్మూలన దినోత్సవం నిర్వహించనున్నామని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఈ కార్యక్రమంపై ప్రచారం విస్తృత ప్రచారం కోసం సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా కరపత్రాలు, బ్రోచర్లు సరఫరా చేశామని తహసీల్దార్ తెలిపారు.

హిందీ భాష దేశ ఐక్యతకు చిహ్నం


ప్రొఫెసర్ సీహెచ్‌వీ మహాలక్ష్మిని సన్మానిస్తున్న సీఆర్‌ఆర్ కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : హిందీ భాష దేశ ఐక్యతకు చిహ్నమని, ఈ భాష చైతన్యవంతమైన భాష అని, జాతీయ భాష అంటే దేశం మొత్తం మాట్లాడేభాష అని సెయింట్ థెరిసా మహిళా కళాశాల ప్రాచ్యభాష శాఖాధ్యక్షులు, అసోసియేట్ ప్రొఫెసర్ సీహెచ్‌వీ మహాలక్ష్మి తెలిపారు. స్థానిక సీఆర్ రెడ్డి అటానమస్ కళాశాలలో హిందీ శాఖ, ఎన్‌ఎస్‌ఎస్, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన మహాలక్ష్మి మాట్లాడుతూ భారత ప్రభుత్వం 1949లో హిందీ భాషను జాతీయ భాషగా ప్రకటించిందన్నారు. విద్య, ఉపాధి అవకాశాల కోసం హిందీని నేర్చుకోమని విద్యార్థులకు సూచించారు. ప్రపంచంలో 150 యూనివర్సిటీల్లో హిందీని బోధిస్తున్నారన్నారు. ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో హిందీ 2వ స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కేఏ రామరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ హిందీభాష గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కరస్పాండెంట్ కొడాలి వెంకట సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొనగా, వైస్ ప్రిన్సిపాల్ కే. విశ్వేశ్వరరావు, హిందీ అధ్యాపకులు కే. సుమిత్ర, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-2 విభాగం నుంచి బీ.శంకర్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అతిథి ఉపన్యాసం

కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో జీఎస్టీ మూలాలు, జీఎస్టీ రిటర్న్ దాఖలులో ఆచరణాత్మక అంశాలు అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన సీఏ శివకిషోర్ దింటకుర్తి పలు అంశాలు వివరించారు.ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కేఏ రామరాజు అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా కళాశాల ఇన్‌చార్జి కరస్పాండెంట్ కొడాలి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ జీ. రాము, వాణిజ్య శాస్త్ర విభాగ అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి కృషి అభినందనీయం


దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఏడీ రామ్‌కుమార్

ఏలూరు (టూటౌన్): సుదీర్ఘంగా దివ్యాంగుల కొరకు పనిచేయడం అభినందనీయమని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ అన్నారు. స్థానిక దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం, ప్రత్యేక డీఎడ్ అండ్ బీఎడ్ కాలేజీలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఏడీ రామ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కేక్ కట్ చేసి సొసైటీ వ్యవస్థాపకుడు ఎస్సీ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1988 సెప్టెంబర్ 13న కాకినాడలో మానసిక దివ్యాంగుల కోసం పాఠశాలను స్థాపించి సుదీర్ఘ కాలంగా దివ్యాంగుల కోసం సమాజ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేయడం గొప్ప విషయమన్నారు. రెండు వందలకు పైగా సిబ్బంది, వేల మంది దివ్యాంగులకు సేవలందించిన సొసైటీ అవసరమైన వారికి కృత్రిమ అవయవాలు, హియరింగ్ ఎయిడ్స్, ట్రై సైకిల్, చక్రాల కుర్చీలు అందించిందన్నారు. 2003లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం, 2019లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం గర్వకారణమన్నారు. దీనితో పాటు ఐదు సార్లు జాతీయ అవార్డులు పొందడం విశేషమన్నారు. సంస్థ కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ సంస్థ 14 రకాల ప్రాజెక్టుల ద్వారా దివ్యాంగులకు అనేక రకాల సేవలందిస్తోందన్నారు. ఏలూరులో ప్రత్యేక డీఎడ్ కాలేజీ ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక విద్యను బోధించడానికి ప్రత్యేక ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్నామన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, ఉపకరణాలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక డీఎడ్ కాలేజీ సిబ్బంది, డీడీఆర్‌సీ సిబ్బంది, డీఎడ్ అండ్ బీఎడ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని ఆఫీసర్స్ క్లబ్ సహకారంతో జీఎస్‌ఎల్ ట్రస్ట్ క్యాన్సర్ సెంటర్ ప్రతినిధులు ఏలూరు హేలాపురి రూరల్, ఏలూరు దుర్గాతేజ లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు తెలిపారు. స్థానిక ఇండోర్ స్టేడియం దగ్గరలోని ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం ఉదయం 9 గంటలకు ఈ శిబిరాన్ని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ శిబిరంలో అత్యధిక మంది పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని, క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని తెలిపారు.

గ్రంథాలయ ఉద్యోగుల పోరుబాట


సమావేశంలో పాల్గొన్న గ్రంథాలయ ఉద్యోగుల సంఘాల నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలోని వివిధ గ్రంథాలయాల్లో పని చేస్తున్న సంస్థ ఉద్యోగుల పదోన్నతుల కోసం పోరుబాట పట్టాలని గ్రంథాలయ ఉద్యోగుల కార్యాచరణ సమితి నిర్ణయించింది. శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గద్దె శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దశాబ్ద కాలం నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు పదోన్నతుల విషయంలో ఉన్నత న్యాయ స్థానం తీర్పు వ్యతిరేకంగా రావడం దారుణమని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు ఉద్యోగులకు వ్యతిరేకంగా వచ్చిన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించు కొనేందుకు రెండు సంఘాల నాయకులు హాజరై భవిష్యత్ కార్యాచరణపై విస్తృత స్థాయిలో చర్చించారు. దీనిలో భాగంగా, ఐక్య కార్యాచరణ సమితిగా ఏర్పడి జిల్లా ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు న్యాయ పోరాటం చేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రాంబాబు హాజరు కాగా ఇరు సంఘాల కార్యవర్గ సభ్యుడు డి.జాన్‌బాబు, టీ. అరుణ్‌కుమార్, టి. ఝాన్సీరాణి, వి.శాంత కుమారి, జే. శ్రీనివాసరావు, బంగారు పాప, విజ్జు సత్యనారాయణ ల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాలు



వరద బాధితులకు సహాయాన్ని కలెక్టర్‌కు అందజేస్తున్న మానవత సభ్యులు

ఏలూరు(మెట్రో): వరద బాధితులను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో చేయూతనందిస్తున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థను కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు జిల్లా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు వరద బాధితుల సహాయార్థం లక్ష రూపాయల చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, కార్యదర్శి పి. దేవరత్నాకరరావు, ఆడిటింగ్ కమిటీ డైరెక్టర్ కడియాల కృష్ణారావు, డవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ మేతర అజేయ్ బాబు, ఏలూరు విభాగం చైర్మన్ అడుసుమిల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం ఒక రోజు వేతనం విరాళం

ఏలూరు (టూటౌన్): సీఎం సహాయ నిధికి ఏపీ గ్రామ రెవెన్యూ అధికారులు తమ ఒక రోజు వేతనం రూ.1.30 కోట్లు విరాళంగా అందజేశారు. ఈమేరకు ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రతినిధులు గురువారం సీఎం చంద్రబాబు నాయుడిని ఆయన నివాసంలో కలిశారు. ఈమేరకు వీఆర్వోల ఒక రోజు వేతనం కట్ చేసుకునేందుకు సంబంధించిన అంగీకారపత్రాన్ని సీఎం చంద్రబాబునాయుడికి అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, కృష్ణా జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శీలం నరసింహారావు, కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లడ నళిని కుమార్ ఉన్నారు.

ఏచూరికి చిత్రకళా నీరాజనం



సీతారం ఏచూరి ముఖచిత్రం, (ఇన్‌సెట్) డ్రాయింగ్ టీచర్ మహమ్మద్ ఇర్షాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సీపీఎం పార్టీ అగ్ర నేత, గురువారం మృతి చెందిన సీతారం ఏచూరికి స్థానిక శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ మహమ్మద్ ఇర్షాద్ చిత్రకళా నీరాజనం సమర్పించారు. ఏచూరి ముఖ చిత్రాన్ని తన కుంచెతో, ఆకర్షణీయమైన వర్ణాలతో అద్భుతంగా మలిచి ఆయన మృతికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

సీతారాం ఏచూరి మృతికి ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): సైద్ధాంతిక వేత్త భారత కమ్యూనిస్టు ముద్దు బిడ్డ, అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం సీపీఎంకు, వామపక్ష ఉద్యమానికి ప్రజాతంత్ర ఉద్యమానికి, సెక్యులర్ శక్తులకు తీరని లోటని సీపీఎం జిల్లా కేంద్ర శాఖ కార్యదర్శి పి.ఆదిశేషు అన్నారు. సీతారం ఏచూరి మృతికి విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబానికి సంతాపం సానుభూతి తెలియజేశారు. కార్మిక, కర్షక పోరాటాల మార్గదర్శి సీతారాం ఏచూరి అని ఆదిశేషు గుర్తు చేశారు.

ఏచూరి మృతికి సంతాపం

ఏలూరు(మెట్రో): సీపీఎం సీనియర్ నాయకులు సీతారాం ఏచూరి మృతి పట్ల ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ నాయకులు సంతాపాన్ని తెలిపారు. శుక్రవారం ఏపీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు మాట్లాడుతూ ఏచూరి మరణం యావత్తు వర్కింగ్ క్లాస్‌కి, అసంఘటిత కార్మిక వర్గానికి తీరని లోటన్నారు.

ప్రతి విషయంపై లోతైన అవగాహన అవసరం


సెన్సార్ల పనితీరుపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సాధారణంగా లభించే జ్ఞానం కన్నా ఒక విషయంపై లోతైన అవగాహన కలిగించడమే నాలెడ్జ్ ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రాం ఉద్దేశ్యం అని సెయింట్ థెరిసా మహిళా స్వయంప్రతిపత్తి కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి నిర్మల జ్యోత్స్న తెలిపారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో బీఎస్సీ మూడవ సంవత్సరం ఫిజిక్స్ విద్యార్థినులు శుక్రవారం నిర్వహించిన నాలెడ్జ్ ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రాంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాలైన సెన్సార్లు, వాటి ఆపరేటింగ్ సిస్టంలు అందరినీ అలరించాయి. నిర్వాహకులను ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపల్ మరియ క్రిస్టియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సిస్టర్ సుశీల ఇతర అధ్యాపకులు అభినందించారు.

భక్తి శ్రద్ధలతో లక్ష్మీ కుబేర వ్రతాలు


కరెన్సీ అలంకరణలో సత్రంపాడు శ్రీలక్ష్మీ గణపతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో నిర్వహిస్తున్న గణపతి నవ రాత్రి ఉత్సవంలో భాగంగా శుక్రవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో మహిళలతో ఉచిత సామూహిక గోపూజ, లక్ష్మీ కుబేర వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి కరెన్సీతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ పూజల్లో పాల్గొన్న వారందరికీ అన్నపనేని రవి కుమార్ దంపతులు చీరలు పంపిణీ చేశారు. భక్తులకు దేవస్థానం తరపున గాజులు, రవిక ముక్క, లక్ష్మీ కుబేర యంత్రం పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ముగిసిన బాల గణేశుని పూజలు

స్థానిక ఆదివారపు పేట శ్రీ షిరిడి సాయి ప్రేమ మందిరం సేవకులు, ఆలయ అధ్యక్షుడు ఇసుకపల్లి తాతారావు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ గణపతి మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. 11 కేజీల లడ్డూను వేలం వేయగా తుంపాల సత్యనారాయణ రూ. 8 వేలకు దక్కించుకున్నారు. 5 కేజీల లడ్డూను కర్రా ప్రభాకర్ రావు దక్కించుకున్నారని అర్చకులు గంగాధర్ తెలిపారు. అనంతరం భక్తులు బాబాను పల్లకిలో నగర వీధుల్లో మేళ తాళాలతో సంకీర్తనలతో భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు.

విద్యాదాత మొటపర్తి రామచంద్రమ్మ మృతి

దెందులూరు: విద్యావేత్త, దెందులూరులో రూ.4 కోట్లతో విద్యా సంస్థలు, నర్సింగ్ కళాశాల, డీఈడీ కళాశాల, కమ్యూనిటీహాళ్లు, టీటీడీ కల్యాణ మండపం, మీసేవ, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, గ్రంథాలయం, వైద్యశాల, ఆర్వో ప్లాంట్‌కు స్థలాలు, భవనాలు నిర్మించిన దాత మొటపర్తి రామచంద్రమ్మ హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆమెకు కుమారుడు మొటపర్తి వెంకట్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గ్రామానికి రూ. 4 కోట్లకుపైగా నిధులు వెచ్చించి స్థలాలు, భవనాలు అందివ్వడమే కాకుండా ఇటీవల రూ.2 కోట్లకుపైగా విలువైన ఆమె ఇంటిని ప్రభుత్వ బాలసదనానికి అందించిన గొప్పదాత అని గ్రామస్తులు, అధికారులు కొనియాడారు. శుక్రవారం దెందులూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.